సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



ఘనంగా మోదమ్మ ఉత్సవాలు

పాడేరులో మోదకొండమ్మతల్లి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. 8లో



వైద్య శిబిరం విజయవంతం

ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. 8లో



పేదల సంక్షేమానికి పెద్ద పీట

పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో

న్యూస్‌రీల్

రంపచోడవరం డైట్‌లో శతశాతం ఉత్తీర్ణత

రంపచోడవరం: స్థానిక ఉపాధ్యాయ శిక్షణ కళాశాల (డైట్) విద్యార్థులు 2020–22 విద్యా సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది నూరు శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం చినబాబు తెలిపారు. పరీక్షకు హాజరైన 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వివరించారు. వీరిలో పి. స్వరూప, ప్రథమ శ్రేణి, బి.పుష్పమేరీ ద్వితీయ శ్రేణి సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన నేపథ్యంలో అధ్యాపకులు డా. భాస్కరరావు, జే.వెంకటలక్ష్మి, ఎం సామ్రాజ్యం, కె బాపిరాజు తదితరులను ఆయన అభినందించారు.

పాడేరులో ఏరువాక కేంద్రం



ఏరువాక కేంద్రం వద్ద శాస్త్రవేత్తలు

సాక్షి,పాడేరు: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు శ్రీకాకుళంలోని ఏరువాక కేంద్రాన్ని జిల్లా కేంద్రం పాడేరుకు తరలించారు. ఇక్కడి పట్టుపరిశ్రమశాఖకు చెందిన భవనంలో ఏరువాక కేంద్రాన్ని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జే.జగన్నాథం, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.వెంకటరావు, పట్టుపరిశ్రమశాఖ ఏడీ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మన్యానికి పండగొచ్చింది

మన్యంలో ఇటుకల పండగ సందడి నెలకొంది. గిరిజనులను వాహనాలు నిలిపి చందాలు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఇవ్వకపోతే వారిపై నీళ్లు పోస్తూ చుట్టుముడుతున్నారు. ఇదంతా మన్యంలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. అందుకే మన్యంలోకి ఎవరు అడుగుపెట్టినా మనస్ఫూర్తిగానే చందాలు ఇస్తారు. ప్రస్తుతం మన్యం రహదారులు ఇటుకల పండగతో కోలాహలంగా మారాయి. ఇలా వచ్చిన డబ్బుతో గ్రామస్తులంతా సామూహికంగా భోజనాలు చేస్తున్నారు. వారం రోజులపాటు ఆ డబ్బును ఖర్చుపెడుతూ థింసా నృత్యాలు చేస్తూ ఆనందంలో మునిగి తేలుతున్నారు.



హుకుంపేట మండలం కామయ్యపేట రోడ్డులో తాచేరు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

- గ్రామ గ్రామాన సందడి
- వాహనాలు నిలిపి చందాలు వసూలు
- ఇటుకల పండగతో కోలాహలంగా రహదారులు
- ఆనందంలో మునిగితేలుతున్న గిరిజనులు

సాక్షి, పాడేరు: ఉగాది పండగ తరువాత గిరిజనులు నిర్వహించే ఇటుకల పండగ వారి ఆచార, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. పంటలు బాగా పండాలని, గ్రామంలో పశుసంపదతోపాటు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రకృతి దేవతలు, గిరిజనుల ఆరాధ్యదైవం శంకులమ్మతల్లికి పూజలు చేస్తుంటారు. కొత్త విత్తనాలకు పూజలు చేయడం ఆనవాయితీ.

శంకులమ్మ తల్లికి పూజలతో శ్రీకారం

ఇటుకల పండగ పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, అరకులోయ మండలాల్లో శుక్రవారం నుంచి ప్రారంభమైంది. గ్రామంలోని శంకులమ్మ తల్లి రాతి విగ్రహానికి పూజలు చేసి పండగకు శ్రీకారం చుట్టారు. థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సందడి చేస్తున్నారు. పండగ సందర్భంగా వారం రోజులు గిరిజనులు పనులకు వెళ్లకుండా తమ గ్రామాలకు పరిమితమవుతుంటారు.

తాసేరు వసూళ్లు

ఇటుకల పండగకు సంబంధించి గిరి యువతులు, బాలికలు తమ గ్రామాల పరిధిలోని ప్రధాన రోడ్లు, జంక్షన్ల వద్ద అడ్డంగా కర్రలు, తాళ్లను అడ్డంగా పెట్టి వాహన చోదకుల నుంచి రూ.10 నుంచి రూ.100 వరకు చందా (తాసేరు) వసూళ్లు చేస్తుంటారు. ఇవ్వని వాహన చోదకులను నీటితో తడుపుతారు. ఒక్కోసారి బురద, పేడ కలిపిన నీటిని కూడా పెద్ద మొత్తంలో జల్లుతుంటారు.

వేట ప్రధానం

ఇటుకల పండగలో గిరిజనులు వేటకు అధిక ప్రాధాన్యమిస్తుంటారు. గ్రామంలోని పురుషులంతా చిన్నా పెద్దా తేడా లేకుండా తమ సమీప అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి జంతువులను వేటాడటం ఆచారం. వేటకు వెళ్లే పురుషులకు మహిళలంతా హారతులిస్తారు. ఆయుధాలకు పూజలు చేసిన అనంతరం వేటకు పంపిస్తారు. వేటకు బయలుదేరినప్పుడు ముందుగా ఊరి పొలిమేరలో కోడిగుడ్డును బాణంతో కొడతారు.అది పగిలిన వెంటనే పురుషులంతా విల్లంబులు, కత్తులు, గొడ్డళ్లు, ఈటెలతో అడవికి వెళ్తారు. సామూహికంగా అడవిజంతువును వేటాడి తీసుకువస్తారు. వేటాడకుండా వచ్చిన వారు మహిళలను తీవ్ర అవమానం ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా బురద,పేడ నీళ్లను వారిపై చల్లుతారు. జంతువును వేటాడి గ్రామానికి తీసుకువస్తే మాత్రం మహిళలంతా వారికి బ్రహ్మరథం పడతారు. వేటాడిన జంతువు మాంసంతో సామూహికంగా విందు ఏర్పాటుచేయడం ఆనవాయితీగా వస్తోంది.

అరకులోయ రూరల్: మండలంలో పద్మాపురం, చొంపి, మాడగడ, గన్నెల, చిన్నలబుడు, బస్కి, సుంకరమెట్ట, బొండం, లోతేరు, మాదల పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది. ప్రధాన రహదారిలో వాహనచోదకుల నుంచి చందాలు వసూలు చేశారు.



డబ్బులు వసూలు చేస్తున్న మహిళలు

దేశంలోనే నంబర్ వన్‌గా సీలేరు కొత్త ప్రాజెక్టు

- ఏడాదికి 3,500 మిలియన్ల యూనిట్ల ఉత్పత్తి లక్ష్యం
- ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ వెల్లడి



మాట్లాడుతున్న హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ, చిత్రంలో జెన్‌కో అధికారులు

సీలేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సీలేరులో నూతనంగా నిర్మించబోయే పంప్డ్ స్టోరేజ్ (అండర్‌గ్రౌండ్)ప్రాజెక్టు దేశంలో నంబర్ వన్‌గా ప్రసిద్ధి చెందనుందని జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సీలేరులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇండియాలో అన్ని ప్రాజెక్టుల నిర్మాణం కన్నా సీలేరు ప్రాజెక్టు మొదటిస్థానంలో నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసర సహకారం కేంద్రం అందిస్తోందన్నారు. డీపీఆర్ రికార్డు పూర్తయిందని, దీనిని కేంద్రం సెంట్రల్ అథారిటీ, అటవీ అనుమతులకు పంపనున్నట్లు చెప్పారు. వారం నుంచి 15రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశముందన్నారు. సీలేరు జలవిద్యుత్‌కేంద్రంలో ఉత్పత్తి అనంతరం విడుదలైన నీరు డొంకరాయి జలాశయంలోకి వెళ్లి అక్కడ నుంచి పంప్డ్ స్టోరేజ్ ద్వారా అండర్‌గ్రౌండ్‌లోని 2.6 కిలోమీటర్ల మూడుపైపులైన్ల ద్వారా ఆ నీటిని సీలేరుకు మళ్లిస్తామన్నారు. పార్వతీనగర్ వద్ద తొమ్మిది యూనిట్ల జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించి 1,350 మెగావాట్స్ విద్యుత్ చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటుచేస్తున్నామని ఆయన వివరించారు. దీని ద్వారా ఏడాదికి 3,500 మినియన్ల ఉత్పత్తి గ్రిడ్‌కు సరఫరా అవుతుందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా గుంటవాడ రిజర్వాయర్ 1.7 పీఎంసీ నీటిని వాడుకునేందుకు వీలుగా డిజైన్ చేసినట్లు చెప్పారు. రోజుకు 10 గంటల ఖాళీ సమయంలో ఉత్పత్తి అవుతుందన్నారు. దీనికి 215 హెక్టార్ల స్థలాన్ని కేటాయించగా ఐదేళ్లలో నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. పచ్చదనానికి, ఇళ్లకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రూ.11 వేల కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా ఈప్రాంతీయులకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో జెన్‌కో హెచ్‌పీసీ చీఫ్ ఇంజనీర్లు సుజయ్‌కుమార్, శేషారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బారావు

కూనవరం: చట్ట ప్రకారమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వస్తుందని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు మూడు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులు ఇచ్చిన ఆధారాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాకే ఆర్‌అండ్‌ఆర్‌కు అర్హులా కాదా వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులు ఎవరూ మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కె.అనసూయ మాట్లాడుతూ సెస్ సర్వేలో లబ్ధిదారులకు సంబంధించి ఏవైనా పొరపాట్లు ఉంటే వాటికి సంబంధించిన ఆధారాలతో వలంటీర్ వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి రికార్డుల్లో సరిచేస్తామని ఆమె పేర్కొన్నారు. వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిచేసి రికార్డులో నమోదు చేస్తామని తెలిపారు. కూనవరం గ్రామ పంచాయతీ పరిధిలో గత నాలుగు రోజుల నుంచి నిర్వహించిన గ్రామసభల్లో 2487 కుటుంబాలు పాల్గొన్నాయి. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, వీఆర్వో పిట్టల వెంకన్న, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనశైలిపై సినిమా

కొయ్యూరు: గిరిజన జీవనశైలిపై త్వరలో సినిమా చిత్రీకరించనున్నట్టు అనుభవించు రాజా చిత్ర దర్శకుడు గవిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.శనివారం ఆయన మండలంలోని డౌనూరు, తురబాలగెడ్డ, నిమ్మలపాలెం ప్రాంతాలను పరిశీలించారు. సినిమా చిత్రీకరణకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించేందుకు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. విభిన్నమైన కథాంశంతో గిరిజనుల జీవనశైలిపై చిత్రం ఉంటుందన్నారు. అంబారీ ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై చిత్రం నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఫొటోగ్రఫీ డైరెక్టర్ యువరాజ్, అంబాని ఫిల్మ్ ప్రొడక్షన్ మేనేజర్ అనిల్‌కుమార్, ఆర్ట్ డైరెక్టర్ సుప్రియ పాల్గొన్నారు.



లొకేషన్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

బయోమెట్రిక్ అమలుపై నిరసన



చీఫ్ ఇంజినీరును కలిసిన ఉద్యోగులు

మోతుగూడెం: బయోమెట్రిక్ అమలుపై జెన్‌కో ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎంవీవీ సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్ బొడ్డు శ్రీధర్‌ను లోయర్ సీలేరు జేఏసీ నాయకులు కలిశారు. బయోమెట్రిక్ హాజరు, టైమింగ్స్‌పై జెన్‌కో యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసి, పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. కార్యాలయాలకు వచ్చినప్పుడు, విధులు ముగించినప్పుడు బయోమెట్రిక్ వేయడం తమ బాధ్యత అని, కానీ యాజమాన్యం బలవంతంగా ఆఫీస్ టైమింగ్స్ మార్చి దాని ప్రకారం అటెండెన్స్ వేయమనడం తగదన్నారు. స్థానిక చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట అకౌంట్స్ఆఫీస్ స్టాఫ్ ధర్నా చేశారు. సీలేరు కాంప్లెక్స్ ఫారెస్ట్ ఏరియాలో ఉండడం వల్ల సరైన రవాణా, మెడికల్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ రామిరెడ్డి
- సహజ మరణాలేనని బాధిత కుటుంబాలకు భరోసా



హైపర్ టెన్షన్‌తో ఉన్న వారిని పరిశీలిస్తున్న వైద్యబృందం

పెదబయలు: రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ వి. రామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో సంభవించిన ఏడు మరణాలకు సంబంధించి బాధిత కుటుంబాల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అవన్నీ సహజ మరణాలేనని వారికి ధైర్యం చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రతీ ఇంటికి వెళ్లి ఆయన వివరాలు సేకరించారు. రోజువారీ వారు తీసుకునే ఆహారం, వ్యసనాలు, అలవాట్ల వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300 మంది జనాభా ఉన్న గ్రామంలో 20 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరి నుంచి రక్త నమూనాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. 84 మందికి బీపీ చెకప్ చేయగా 20 మంది హైపర్ టెన్షన్ ఉందని ఆయన వెల్లడించారు. గ్రామంలో సంభవించిన ఏడు సహజ మరణాలే అయినప్పటికీ తక్కువ వ్యవధిలో సంభవించడం వల్ల గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారని హెల్త్ డైరెక్టర్ పేర్కొన్నారు. చెడు అలవాట్ల వల్లే బీపీ లెవెల్స్ ఎక్కువగా ఉన్నాయన్నారు. బీపీ ఎక్కువగా ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ప్రతీరోజు మాత్రలు వేసుకునేలా ఆశా కార్యకర్త, గ్రామ వలంటీర్ పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. సాధారణ పరిస్థితి నెలకొనే వరకు వైద్యశిబిరం కొనసాగించాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పిల్లలను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు.

భూత వైద్యానికి దూరంగా ఉండాలి

గ్రామంలో వరుస మరణాలు సంభవించడం వల్ల ఏదో గ్రామానికి సోకిందని మూఢ నమ్మకాలతో ఆందోళన చెందుతున్నారని, భూత వైద్యులు ఏదో గ్రామానికి జరిగిందని చెప్పడంతో గ్రామస్తుల్లో భయం పెరిగిందని రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. భూత వైద్యానికి దూరంగా ఉండి వైద్య సిబ్బంది ఇచ్చిన మందుల వాడితే బీపీ తగ్గుతుందని,ఎవ్వరు భయపడాల్సిన పనిలేదని అన్నారు. గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరో వైద్యాధికారిని నియమిస్తామని తెలిపారు. 24 గంటలు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. గోమంగి పీహెచ్‌సీకి అంబులెన్సు కేటాయిస్తామని చెప్పారు.

పీహెచ్‌సీల తనిఖీ

మండలంలోని పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ మరియు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి సందర్శించారు. రోజు వారీ ఓపీ, ఆస్పత్రిలో కాన్పులు, పీహెచ్‌సీ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ల్యాబ్‌లో జరిగే పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గోమంగి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో జమాల్ బాషా, డీఎంవో సాంబమూర్తి, పాడేరు జిల్లా ఆస్పత్రి ఫిజీషియన్ సర్వేశ్వరరావు, సీడీపీవో రాజేశ్వరి, పెదబయలు వైద్యాధికారి సింధూరం పడాల్, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.



గోమంగి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న రామిరెడ్డి

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్యం మరింత చేరువ

పెదబయలు : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగాను ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్టు రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి వెల్లడించారు. పెదబయలులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. విలేజ్ క్లినిక్‌ల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,00,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. క్లినిక్ పరిధిలో రెండు వేల మందికి వైద్య సేవలు అందడమే కాకుండా 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ కిట్స్, 67 రకాల మందులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్యాధికారి, మిగిలిన టీమ్ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల్లో నెలకు రెండు సార్లు వెళ్తారని తెలిపారు. పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో సదుపాయాల కల్పిస్తామన్నారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఎంవో సాంబమూర్తి, జిల్లా ఆస్పత్రి ఫిజీషియన్ సర్వేష్, వైద్యాధికారి రమ పాల్గొన్నారు.

ఘనంగా మోదమ్మ ఉత్సవాలు

- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- వైభవంగా పందిర రాట కార్యక్రమం

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులో మోదకొండమ్మతల్లి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు.ఉత్సవాలకు సంబంధించి స్థానిక మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద పందిరిరాట ప్రతిష్ఠ శనివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం పందిరిరాటకు ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యేతోపాటు ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు పందిరిరాటకు తొలిపూజ చేశారు.అనంతరం పందిర రాటను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మే 14, 15, 16 తేదీల్లో ఉత్సవాలు, 12న అమ్మవారి పుట్టినరోజు ఘనంగా నిర్వహిస్తామన్నారు. వీటి విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు ఉత్సవ కమిటీకి సహకరించాలన్నారు. అనంతరం ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, వైస్ ఎంపీపీలు కనకాలమ్మ ,గంగపూజారి శివకుమార్, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,ఉత్సవకమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ప్రధాన కార్యదర్శి నవర కొండబాబు, ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు కొట్టగుళ్లి సుబ్బారావు,రామారావు, బోనంగి రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

334 మందికి వైద్య పరీక్షలు

సాక్షి,పాడేరు: ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవతో గాయత్రి విద్యా, వైద్యసంస్థలు నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. కలెక్టరేట్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలు, పాడేరు ఐటీడీఏ, సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు 334 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసన్‌లో 150 మందికి, కార్డియాలజీలో 25, గైనిక్ 54, డెంటల్ 25, కంటికి సంబంధించి 35 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జి.మాడుగుల మండలం కుంబిడిసింగికి చెందిన ఎస్.నీలవేణికి కలెక్టర్ దగ్గరుండి వైద్య పరీక్షలు జరిపించారు. ఆమెకు విశాఖలోని తమ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు ఉచితంగానే అందిస్తామని గాయత్రి ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అలాగే పలువురు గిరిజనులు కూడా ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ వైద్యశిబిరంలో మెడిసన్ పర్యవేక్షకుడు జనరల్ సర్జన్ డాక్టర్ ఎ.రంగారావు, జనరల్‌మెడిసన్ డాక్టర్‌వి.ధర్మారావు, డాక్టర్ అఖిలేష్, ముఖ్య పరిపాలనాధికారి, జనరల్ సర్జన్ డాక్టర్ అనీల్‌చంద్ర, పలు విభాగాల వైద్యనిపుణులు రాఘవేంద్ర, చంద్రశేఖర్, నరసింహరావు, ఉమాదేవి,సౌమ్య, కె.ఎస్.బోస్, సాయిరూప్, సూర్యప్రకాష్, లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, డీఆర్వో అంబేద్కర్, ఇన్‌చార్జి తహసీల్దార్ వి.త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్ద పీట

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- వైఎస్సార్ ఆసరా పంపిణీ

రాజవొమ్మంగి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం ఆమె స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలు తీసుకున్న రూ.80 కోట్లు వారికి ఎంతో భారం అని తెలిసిన సీఎం జగనన్న ఆ రుణాలను నాలుగు దఫాలుగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈమేరకు రుణం తీర్చుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. మూడవ విడతలో రాజవొమ్మంగి మండలంలో 7062 మంది మహిళాసభ్యులు రూ. 2.61 కోట్ల మేర మాఫీను పొందుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఏఒక్క హామీని అమలు చేయలేకపోయిందన్నారు. సంక్షేమ పథకాలు తెలుగు తమ్ముళ్లకే సరిపోయేవని విమర్శించారు. ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. అందరి సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ ఫొటోలకు పాలాభిషేకం నిర్వహించారు. ఆసరా పథకం నమూనా చెక్కును అందజేశారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, దాసరి నాగేశ్వర్రావు, చీడి శివ, సత్యన్నారాయణ, వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, ఎంపీటీసీ గంగదుర్గ, నిర్మలాదేవి, కానెం అచ్చియమ్మ, కోఆప్షన్‌మెంబర్ అడపా కామేష్, ఎంపీడీవో బాపన్నదొర, వెలుగు ఏపీడీ పరమేష్, ఏపీఎం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. సీఐ షేక్ బాజిలాల్, ఎస్ఐలు గోపీనరేంద్రప్రసాద్, షరీఫ్ బందోబస్తు నిర్వహించారు.



తోటకూర పాలెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, మహిళలు

మహిళాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

వై.రామవరం: మహిళాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చవిటిదిబ్బల సచివాలయం పరిధి తోటకూరపాలెం గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మామిడి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని, 164 మహిళా సంఘాలకు చెందిన 1545 మంది సభ్యులు రూ.55,23,367 లబ్ధిపొందినట్టు తెలిపారు. అనంతరం డ్వాక్రా సభ్యులకు ఆసరా చెక్కు అందజేశారు. అనంతరం మహిళలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్ బచ్చలి చిన్నమ్మలు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, బచ్చలి రమేష్, పల్లాల రమణమ్మ, ఏపీఎం మధుబాబు, తహసీల్దార్ ఎ.తాతారావు తదితరులు పాల్గొన్నారు.



దుప్పలపాలెంలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

వైద్య సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

అడ్డతీగల: మన్యంలో వైద్యసౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు.అడ్డతీగల మండలం దుప్పలపాలెంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. మొదట శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ఆస్పత్రిలోని వైద్యుల,ఇన్‌పేషంట్ల గదులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ,ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,వైస్ ఎంపీపీ కరణం వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న కల్యాణోత్సవం

- సాయంత్రం 6.30 గంటల నుంచి ఎదురుసన్నాహోత్సవం
- రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం
- రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం

సింహాచలం: చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరగనుంది. సింహగిరిపై ఉన్న నృసింహ మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు నీలాద్రి గుమ్మం వద్ద అర్చకులు, ముత్తైదువులు పసుపు కొమ్ములను దంచి కొట్నాలు ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో ఉంచి మాడ వీధుల్లో ఉంచి ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు సింహగిరి మాడ వీధుల్లో రథోత్సవాన్ని నిర్వహిస్తారు. రథోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను నృసింహ మండపంలోకి తీసుకెళ్లి అక్కడ భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేంజేపచేస్తారు. రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

విశేషంగా ఏర్పాట్లు

- రథోత్సవం, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో పలు శాఖల సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- నృసింహ మండపంలో భారీ ఎత్తున కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. పలు రకాల పుష్పాలు, భారీ విద్యుద్దీపకాంతులతో కల్యాణవేదికను అలంకరిస్తున్నారు.
- నృసింహ మండపంలో ఉన్న గార్డెన్‌లో కూర్చుని కల్యాణాన్ని తిలకించే విధంగా సాధారణ భక్తులకు మూడు గేలరీలు, వీఐపీలకు ఒక గ్యాలరీ ఏర్పాటు చేశారు.
- మొత్తం ఐదు పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి అందులో కూడా భక్తులు కల్యాణాన్ని తిలకించే విధంగా ఏర్పాటు చేశారు.
- 10వేల చిన్న లడ్డులను, పదివేల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లనుప్రసాదంగా అందించనున్నారు.
- మధ్యాహ్నం అన్నదాన భవనంలో 5 వేల మందికి, రాత్రి 5 వేల మందికి అన్నప్రసాదాన్ని అందించనున్నారు.



నృసింహ మండపంలో సిద్ధం చేస్తున్న కల్యాణ వేదిక

పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లాలో 63 కేంద్రాలు
- హాజరుకానున్న 11,522 మంది విద్యార్థులు
- జిల్లా పరిశీలకుడు సుబ్బారెడ్డి

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాల్లో ఈనెల 3వతేదీ నుంచి 18 వరకు జరిగే టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పరీక్షల విభాగం జిల్లా పరిశీలకుడు, మధ్యాహ్న భోజన పథకం అదనపు సంచాలకుడు ఎ. సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన జిల్లా కేంద్రం పాడేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. టెన్త్ పరీక్షల ఏర్పాట్లను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసిన 63 పరీక్ష కేంద్రాల్లో 11,522 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ విభాగంలో 5,105 మంది బాలికలు, 5,870 మంది బాలురు మొత్తం 10,975 మంది పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. వీరితోపాటు ప్రైవేట్ విభాగంలో బాలికలు 278 మంది, బాలురు 269 మంది పరీక్ష రాయనున్నట్టు చెప్పారు. పరీక్ష ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు జరుగుతుందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు జేస్తున్నామని తెలిపారు. డిపార్టుమెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, విద్యార్థులు మొబైల్ ఫోన్లను వెంట తీసుకురాకూడదన్నారు. పరీక్షలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు నిబంధనలను అతిక్రమిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆరు ప్రశ్నపత్రాలు ఉంటాయని, సైన్సు పేపరుకు సంబంధించి జీవశాస్త్రం, భౌతిక శాస్త్రానికి వేర్వేరుగా జవాబు పత్రాలు రాయాలని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈవో సలీంబాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు సుబ్బారెడ్డి పక్కన డీఈవో సలీంబాషా